
జీజీహెచ్‌లో పిల్లలకు పునర్జన్మ

ఒకప్పుడు పిల్లలకు ఏదైనా ఆపరేషన్ కావాలంటే గుంటూరు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రైవేటుకు వెళితే వేలాది రూపాయాలు ఖర్చు అయ్యేవి. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో విజయవాడలోనే పిడియాట్రిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సూపర్‌స్పెషాలిటీ విభాగమైన పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. డిసెంబరు 29 జాతీయ పిడియాట్రిక్ సర్జరీ దే సందర్భంగా ప్రత్యేక కథనం..

- ఎన్నో అరుదైన ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు
- జీజీహెచ్‌లో ఏడాదికి 450కి పైగా సర్జరీలు
- వాటిలో వంద వరకూ అరుదైన ఆపరేషన్లు
- అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 15 ఏళ్ల లోపు వారికి శస్త్ర చికిత్సలు
- అందుబాటులో సూపర్‌స్పెషాలిటీ పిడియాట్రిక్ సర్జరీ విభాగం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పదిహేనేళ్లలోపు పిల్లలకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సూపర్‌స్పెషాలిటీ విభాగమైన పిడియాట్రిక్ సర్జరీ ప్రారంభించి ఏడాది కాగా, ఇప్పటి వరకూ 450 వరకూ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వాటిలో వందకు పైగా అరుదైన శస్త్ర చికిత్సలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఒకప్పుడు పిల్లలకు ఏదైనా శస్త్ర చికిత్స చేయాలంటే గుంటూరు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే డబ్బులు ఖర్చు చేసి ప్రైవేటులో చేయించుకోవాల్సి వచ్చేది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా విజయవాడలో సూపర్‌స్పెషాలిటీ విభాగాలను అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా పిడియాట్రిక్ సర్జరీ విభాగం ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో నలుగురు వైద్యులు సేవలు అందిస్తున్నారు.


జీజీహెచ్‌లో పిడియాట్రిక్ సర్జరీ దృశ్యం

అత్యాధునిక సౌకర్యాలు....

సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అధునాతన వసతులతో 12 పడకల వార్డుతోపాటు ఐసీయూ అందుబాటులో ఉంది. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో అవుట్‌పేషంట్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆయా రోజుల్లో 25 నుంచి 30 మంది వరకూ వివిధ సమస్యలతో చిన్నారులు వస్తుంటారు. వారిని వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తారు. పిల్లలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆపరేషన్ థియేటర్‌తో పాటు, పరికరాలు ఏర్పాటు చేశారు.

ఎన్నో జబ్బులకు చికిత్స...

పిడియాట్రిక్ సర్జరీ విభాగం ప్రారంభించి ఏడాది కాగా, ఆ విభాగంలో ఇప్పటి వరకూ 450 వరకూ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వాటిలో 100కు పైగా అరుదైన శస్త్ర చికిత్సలు ఉన్నట్లు వైద్యులు అంటున్నారు. ఇక్కడకు వచ్చే వారిలో నవజాత శిశువులో పేగులు సరిగా డెవలప్ అవని చిన్నారులు, పుట్టుకతో కిడ్నీ ప్రాబ్లమ్స్ ఉన్న వారు, ఊపిరితిత్తులు, లివర్ సమస్యలున్న వారు, చిన్న పిల్లల్లో క్యాన్సర్ వంటి సమస్యలకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. పెద్ద పిల్లల్లో కిడ్నీలో రాళ్లు, 24 గంటల కడుపునొప్పి, హెర్నియా, విరోచనం సరిగ్గా అవకపోవడం వంటి సమస్యలతో వస్తున్నారు. అలాంటి వారికి నిర్ధారణ పరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎంతో మంది పేద పిల్లలకు పునర్జన్మను ప్రసాదిస్తున్నారు.

అరుదైన సర్జరీలు చేస్తున్నాం



మా వద్దకు అప్పుడే పుట్టిన పిల్లల నుంచి పదిహేనేళ్లలోపు వయస్సు వారు వివిధ సమస్యలతో వస్తున్నారు. వారిని పరీక్షించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఏడాదిలో 450 శస్త్ర చికిత్సలు నిర్వహించగా, వాటిలో వందకు పైగా అరుదైన సర్జరీలు ఉన్నాయి.

–డాక్టర్ రోహిత్, పిడియాట్రిక్ సర్జన్, జీజీహెచ్

పుట్టుకతో సమస్యలకు సర్జరీలు



మా వద్దకు పుట్టుకలో లోపాలున్న నవజాత శిశువులు ఎక్కువగా వస్తున్నారు. వారికి క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వాస్పత్రిలో పుట్టిన వారితో పాటు, ప్రైవేటు ఆస్పత్రిల నుంచి కూడా సర్జరీల కోసం వస్తున్నారు. ఇలా ఎన్నో అరుదైన చికిత్సలు విజయవంతంగా నిర్వహించాం.

–డాక్టర్ దశరథరావు,
పిడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి, జీజీహెచ్

షిరిడీ సాయిబాబా మందిరానికి అరుదైన పురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరానికి అరుదైన పురస్కారం లభించింది. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో మందిరంలో దాతలు భక్తుల సహకారంతో పలు ఆధ్యాత్మిక, సేవా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని గుర్తించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు అత్యున్నత పురస్కారం అందజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మందిరానికి సమాచారం అందజేశారు. ఈ నెల 29వ తేదీ శుక్రవారం అమృత్‌సర్‌లో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యాన బాలీవుడ్ సెలబ్రిటీస్, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి పురస్కారం అందజేయనున్నారు. లోక కళ్యాణార్థం నిర్వహించిన నిర్వహించిన లక్ష నారికేళ అభిషేకం, లక్ష కిలోల బియ్యంతో తండులాభిషేకం, దశసహస్ర వస్త్ర పూజ, కోటి రుద్రాక్ష అభిషేకంలకు ఇప్పటికే మందిరానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డులు దక్కాయి. పేదలకు దుప్పట్లు పంపిణీ, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజుల చెల్లింపు, నిత్యాన్నదానం, ఉచిత హోమియో వైద్యసేవలు అందిస్తున్నారు.

క్లుప్తంగా

31 లోగా పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలు, డ్రైనేజీ, తాగునీటి పన్నులను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి పన్ను చెల్లింపులకు మూడు రోజులు మాత్రమే గడువు ఉందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారుల కోసం వీఎంసీ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని చిట్టినగర్, సత్యనారాయణపురం, పటమటలో ఏర్పాటు చేసిన మూడు క్యాష్ కౌంటర్లు ఆఫీస్ వేళల్లో పనిచేస్తాయని తెలిపారు. నగరవాసులు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

బంగారు కవచంలో అభయాంజనేయస్వామి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన అభయాంజనేయస్వామికి గురువారం బంగారు కవచం, ఇతర ఆభరణాలు అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు కింద కొలువై ఉన్న అభయాంజనేయ స్వామి, అపరాజిత దేవి అమ్మవార్లకు దాతలు సమర్పించిన వెండి, బంగారు ఆభరణాలు అలంకరించి పూజలు నిర్వహించారు. కండవల్లి, పెరవలికి చెందిన భూపతి రాజు వరాహ వెంకట సూర్య నారాయణ రాజు, హైమవతి సూర్యకుమారి దంపతులు స్వామికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు దాతలచే పూజలు జరిపించారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్. రమేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

6న రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్, సచిన్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి ఆరు నుంచి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్.సుధాకర్, వి.నాని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని అంతర్జాతీయ క్రికెట్ మైదానాల్లో జరిగే ఈ పోటీలకు 20 జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. విన్నర్ జట్టుకు రూ. 5 లక్షలు, రన్నర్ జట్టుకు రూ. 3 లక్షలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 7075266438, 8332983777ను సంప్రదించాలని కోరారు. ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న జట్లకే పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

సీనియర్ జర్నలిస్ట్ కొండా రాజేశ్వరరావు కన్నుమూత



భవానీపురం(విజయవాడ పశ్చిమ): సీనియర్ జర్నలిస్ట్ కొండా రాజేశ్వరరావు గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గత కొంత కాలంగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. వివిధ పత్రికల్లో జర్నలిస్ట్‌గా పని చేసిన ఆయన కొంత కాలం న్యాయవాది వృత్తిని చేపట్టారు. ఏపీయూజేడబ్ల్యూ విజయవాడ యూనిట్ కార్యదర్శిగా యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. రచయితగా కొన్ని కవితలు రాసిన ఆయన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలో సేవలు అందించారు. కొండా రాజేశ్వరరావు ఆకస్మికంగా మరణించిన విషయం తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజేశ్వరరావు అకాల మృతిపట్ల వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయుడు సస్పెన్షన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొత్తపేట అన్నపూర్ణాదేవి వీఎంసీ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.పుల్లేంద్రబాబును సస్పెండ్ చేస్తున్నట్లుగా జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవ్వటం, మద్యం తాగి విధులకు హాజరుకావటం, విధులు పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించటం వంటి పనులపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఇటీవల విచారణకు ఆదేశించారు. వచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుల్లేంద్రబాబును సస్పెండ్ చేస్తున్నట్లు రేణుక ప్రకటించారు.

కార్తికేయకు అభినందనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సంగిరెడ్డి గురు కార్తికేయ స్పెల్ బీ ఇంగ్లీష్ సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గురువారం స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు ప్రత్యేక బహుమతిని అందచేశారు. రాజారావు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన అమరావతి బాలోత్సవం పిల్లల పండుగలో కార్తికేయ ద్వితీయ బహుమతి అందుకోవడం స్కూల్‌కు గర్వకారణమన్నారు.

జగనన్న హయాంలోనే అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయటమే కాకుండా వాటి ప్రారంభోత్సవాలూ చేయటం గర్వకారణంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు గురువారం 44వ డివిజన్ విద్యాధరపురంలో ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో రూ.74.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న పలు రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ టీడీపీ హయాంలో కేవలం శంకుస్థాపనలు మాత్రమే చేసేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నామని తెలిపారు. టీడీపీ పాలనలో డివిజన్‌లోని కొండ ప్రాంతం అభివృద్ధిని పట్టించుకోకుండా గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్స్, రిటైనింగ్ వాల్స్ నిర్మించి అభివృద్ధి చేశామని చెప్పారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రతి నెలా ఒకటవ తేదీ వేకువ జామునే తలుపుతట్టి మరీ పింఛన్ అందచేస్తున్నారని అవ్వాతాతలు సంతోషంతో చెప్పటం ఆనందాన్ని కలుగు చేస్తుందన్నారు.


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, భాగ్యలక్ష్మి, రత్నకుమారి

రూ.15 కోట్లతో క్రీడా స్టేడియం నిర్మాణం...

విద్యాధరపురం ఆర్టీసీ డిపో పక్కన ఉన్న ఖాళీ స్థలంలో క్రీడా స్టేడియం నిర్మిస్తామని హడావుడిగా శంకుస్థాపన చేసిన చంద్రబాబు ఏళ్లు గడిచినా ఒక్క ఇటుక కూడా పేర్చలేదని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.15 కోట్ల ప్రభుత్వ నిధులతో స్టేడియం నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. మొదటి దశలో రూ.7 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. విశ్వసనీయత లేని ప్రతిపక్షాల మాటలు నమ్మి అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కర్లు సమ్మె చేయవద్దని కోరారు. నాటి చంద్రబాబు ప్రభుత్వానికి, నేటి జగనన్న ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ఉద్యోగులు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే ముఖ్యమంత్రి వద్ద సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, పార్టీ నాయకులు విరజాల మధు, వల్లం రవికుమార్, వెలంపల్లి సుబ్బారావు, చిట్టూరి రాఘవ ఏజీఎల్ నారాయణ, జీ రామదాసు, షఫీఉల్లా, ఉస్మాన్ బేగ్, సుంకర నారాయణ, ముత్తా వాసు, బోర మల్లేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలు తెలియజేయాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీగౌతమ్ స్మార్ట్ క్యాంపస్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్కూల్ అధినేత ఎస్. సూర్యారావు పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విచ్చేశారు. స్కూల్ ఆవరణలో భోగి మంటలు, చిన్నారులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును వీక్షించారు. అనంతరం చిన్నారులకు భోగిపళ్లు పోసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాల గురించి తెలియజేయడం అభినందనీయమని వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతరం చెస్ టోర్నీ, కూచిపూడిలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.తులసీ, వైఎస్. ప్రిన్సిపల్ శ్రీరామ్, ఇన్‌చార్జి మధులత, రమా, రేష్మా, సునీత, ఉమా తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి

సృజనాత్మకత వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్లు

రాష్ట్ర తెలుగు భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ అండ్ ఆర్ట్స్ ఫెస్టివల్ కార్యక్రమం దోహదం చేస్తుందని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు తెలిపారు. చిట్టినగర్‌లోని సాయి అరుణ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 10వ సైన్స్ అండ్ ఆర్ట్స్ ఫెస్టివల్‌ను ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ ఫెస్టివల్‌లో రామాయణం, భువన విజయంకు సంబంధించిన నమూనాలను ప్రదర్శించిన చిన్నారులు వాటి గురించి చక్కగా వివరించటం ఆకట్టుకుంది. అదే విధంగా పోలవరం ప్రాజెక్ట్, చంద్రయాన్–3, సోలార్ సిస్టమ్, ఫుడ్ పిరమిడ్ తదితర నమూనాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే చాలదని, వారికి ఇష్టమైన, ఆసక్తిగల సబ్జెక్టులో శిక్షణ ఇస్తే తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తారని చెప్పారు. మాతృభాషపై మమకారం పెంచుకోవాలని, ఆ తరువాతే మిగిలిన భాషలపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థులు తమ భావాలను వెల్లడించేందుకు తెలుగు భాష చక్కటి ఆయుధమని పేర్కొన్నారు. భారత దేశం అభివృద్ధి యువశక్తిపైనే ఆధారపడి ఉందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలిగితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సర్ సీవీ రామన్ వంటి శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

ఈ సైన్స్ అండ్ ఆర్ట్స్ ఫెస్టివల్‌కు న్యాయనిర్ణేతగా విద్యావేత్త యిప్పిల వెంకటరెడ్డి వ్యవహరించగా 47, 51 డివిజన్ల కార్పొరేటర్లు గోదావరి గంగ, మరుపిళ్ల రాజేష్, పాఠశాల కరస్పాండెంట్ గుజ్జారి అప్పారావు, ఉపాధ్యాయులు టి.దుర్గారావు, టీవీ రామకృష్ణ, పి. దేవరాజ్ కుమార్, వి.శేషగిరి, విద్యుల్లత, దమయంతి, శ్రీదేవి, హేమలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విజయబాబు, మేయర్ భాగ్యలక్ష్మి, రాజేష్ తదితరులు

వరహాలశెట్టి సేవలు చిరస్మరణీయం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాధవ్ కౌశిక్, శివారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు


బుక్ స్టాల్‌ను తిలకిస్తూ పుస్తకాలు చూస్తున్న యువతీ, యువకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ ప్రచురణకర్త వరహాలశెట్టి సాహితీ లోకానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రచయిత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా పుస్తక మహోత్సవ ప్రాంగణానికి నిర్వాహకులు వరహాలశెట్టి పేరు పెట్టారు. అలాగే ప్రతిభావేదికకు శ్రీరమణ, సాహిత్యవేదికకు రచయిత కేతు విశ్వనాథరెడ్డి పేర్లను నిర్వాహకులు ప్రకటించారు. వారి సంస్మరణ సభలను గురువారం రాత్రి ప్రధాన వేదికపై నిర్వహించారు. ఈ సభకు సాహితీవేత్త, నాయకులు ఓబులేసు అధ్యక్షత వహించారు. అనంతరం యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మూడు జిల్లాలోనూ 50 ఏళ్లపాటు సాహితీప్రియుడు, పోషకుడుగా వరహాలశెట్టి తెలుగు సాహితీ లోకంలో చిరస్థానం పొందారన్నారు. మహాకవి శ్రీశ్రీ, చందు సుబ్బారావు లాంటి పలువురు కవులు, సాహితీ మూర్తులు బుక్‌సెంటర్ కేంద్రంగా నిత్యం సాహితీ గోష్ఠులు నిర్వహించుకునేవారని గుర్తు చేశారు. వరహాలశెట్టి పేరు విజయవాడ పుస్తకమహోత్సవ ప్రాంగణానికి పెట్టడం ద్వారా ఉత్తరాంధ్ర సాహితీ మూర్తులందరినీ గౌరవించినటయిందన్నారు. శ్రీరమణ గురించి పన్నాల సుబ్రహ్మణ్యభట్టు వివరించారు. తెలుగు సాహిత్యంలో వ్యంగ్యాన్ని వ్యక్తీకరించిన రచయితల్లో పానుగంటి లక్ష్మీనరసింహారావు తర్వాత స్థానాన్ని శ్రీ రమణకు ఇవ్వవచ్చన్నారు. సుతిమెత్తగా హృదయాల్లోకి చొచ్చుకుపోయేలా మన చుట్టూ జరుగుతున్న ఘటనలపై మనకు స్పృహ కలిగించే శక్తి హాస్య రచయితలకే ఉందన్నారు. సాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి సాహితీకృషి గురించి సాహితీవేత్త మందలపర్తి కిషోర్ వివరించారు. విజయవాడ నగరాన్ని పూర్తిగా తిరిగి సొంతం చేసుకున్న రచయితల్లో కేతు విశ్వనాథరెడ్డి ఒకరన్నారు. పాత్రికేయుడుగా, రచయితగా తెలుగుసాహిత్యంపై కేతువిశ్వనాథరెడ్డి తనదైన ముద్ర వేశారన్నారు. పల్లెల నుంచి పట్టణాలకు వలసవచ్చి తమ అస్తిత్వం కోసం ఆవేదన చెందుతున్న వ్యక్తుల మనోభావాలను తన కథల ద్వారా అద్భుతంగా వెల్లడించారన్నారు. 'దాపుడుకోక', 'జప్తు', 'వానకురిసే' తదితర కథలను ఆయన ఉదహరించారు. కేతు విశ్వనాథరెడ్డి రచనాశిల్పం సామాన్యులను, మేధావులను ఒకేరకంగా ఆకట్టుకుంటుదన్నారు. మేజిక్ షో విశేషంగా ఆకట్టుకుంది.



పుస్తకాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణా జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్‌కాలనీలో గల జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న 77 మంది విద్యార్థులకు 'స్ఫూర్తి' పేరుతో ముద్రించిన స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాల్లోని విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఇప్పుడు ఇచ్చిన స్టడీ మెటీరియల్ పుస్తకం రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలను కల్పించి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న ఏకైక సీఎం జగనన్న అని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.


మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

సమ్మోహనం.. సాంస్కృతిక కళావైభవం

విజయవాడ కల్చరల్: అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సమ్మోహనంగా సాగాయి. ఆంధ్ర నాట్యాచార్యుడు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు బృందం, శారద నృత్య క్షేత్రం నిర్వాహకుడు సంతోష్ బృందం ఆధ్వర్యంలో ఆంధ్రనాట్య సంప్రదాయంలో కుంభహారతి అంశాలను ప్రదర్శించాయి. కూచిపూడి నాట్యాచార్యుడు సప్పా శివకుమార్, భాగవతుల వెంకట్రామశర్మ, సీహెచ్ అజయ్‌కుమార్ బృందం, పద్మశ్రీ హేమంత్, యల్లా జోస్యుల అనూరాధ కూచిపూడి సంప్రదాయంలో వచ్చెను అలివేలుమంగ, అదివో అల్లదివో శ్రీహరివాసము.. తదితర అంశాలకు నృత్యాలను ప్రదర్శించారు. జానపద గాయకుడు డాక్టర్ దామోదర గణపతిరావు బృందం జానపద గీతాలను ప్రదర్శించగా, బాలాజీ నాయుడు దుర్యోధన ఏకపాత్రను అభినయించారు. ఆటా అధ్యక్షుడు మధుబొమ్మినేని, ఆటా ఎలెక్టెడ్ అధ్యక్షుడు జయంత్ చిట్టా, తెలుగు సంఘం అధ్యక్షురాలు భాను స్వర్గం, నాట్యాచార్యుడు కె.వి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంగీత విద్వాంసులు దండమూడి సుమతీ రామ్మోనరావు, నాట్యాచారిణి డాక్టర్ ఎస్.పి.భారతని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.


దండమూడి సుమతి, డాక్టర్ భారతిని సత్కరిస్తున్న నిర్వాహకులు


సాంస్కృతిక ప్రదర్శనలు

భర్త, అత్తలపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు పాల్పడుతున్న భర్త, అత్తలపై వివాహిత కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన ఆలకుంట వెంకటరమణ, అంజిబాబు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం కాగా అంజిబాబు మట్టి పని మేస్త్రీగా పని చేస్తుంటాడు. వెంకట రమణ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. గత కొంత కాలంగా అంజిబాబు భార్య, పిల్లలను పట్టించుకోకుండా మరో మహిళతో వివాహేత సంబంధం పెట్టుకుని వేధింపులకు గురి చేయసాగాడు. ఇదే విషయం అత్త వెంకట నర్సమ్మకు తెలిపినా పట్టించుకోకపోగా వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.